నమస్తే తెలంగాణ

# కాంగ్రెస్‌కు ఓటేస్తే ఐదేండ్లు ఏడుపే

- యాభై ఐదేండ్ల పాలనలో చేసిందేమీ లేదు
- ఎక్కడ చూసినా వలస బతుకులే
- ఇప్పుడు నమ్మితే పాత కథే అయితది
- కేంద్రంలోని బీజేపీతో అన్నింటి ధరలు పైపైకి
- బీఆర్‌ఎస్‌తోనే ప్రజా సంక్షేమం
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- పెగడపల్లి, గొల్లపల్లి మండల కేంద్రాల్లో రోడ్‌షోలు
- ప్రజలు ఆశీర్వదిస్తే కడుపులో పెట్టుకుని చూసుకుంటా
- ధర్మపురి అభ్యర్థి, కొప్పుల ఈశ్వర్



పెగడపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన రోడ్ షోలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ కలవకుంట్ల కవిత, పక్కన ధర్మపురి అభ్యర్థి, మంత్రి ఈశ్వర్, ఎంపీ వెంకటేశ్‌నేత

పెగడపల్లి/గొల్లపల్లి, నవంబర్ 19: 'కాంగ్రెస్ యాభై ఏండ్ల పాలనలో ఈ ప్రాంత ప్రజలు ఉపాధి కరువై ఆగమైన్రు. వలస పోయి దుర్భర జీవితం గడిపిన్రు. మళ్లీ ఆ పార్టీకి ఓటేస్తే ఐదేండ్లు ఏడుపు తప్పదు' అని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. కాంగ్రెస్ నమ్మితే ప్రజలను మోసం చేసి రాష్ట్రాన్ని అంధకారం చేస్తుందని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ధర్మపురి ధర్మరాజు అని, ఈ ప్రాంత అభివృద్ధికి ఎనలేని సేవ చేస్తున్నారన్నారు. ప్రజా సంక్షేమం 18 గంటల పాటు పని చేస్తున్నారని, మరింత అభివృద్ధి చెందాలంటే ఈశ్వర్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈశ్వరన్నను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే నియోజకవర్గంలోని దళితులందరికీ ఒకేసారి దళిత బంధు ఇస్తామన్నారు. ధర్మపురి అసెంబ్లీ బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా ఆమె ఆదివారం పెగడపల్లి, గొల్లపల్లి మండల కేంద్రాల్లో నిర్వహించిన రోడ్‌షోలకు హాజరయ్యారు. ఎంపీ వెంకటేశ్‌నేతకాని, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతతో కలిసి పెగడపల్లి అంబేద్కర్ చౌరస్తా వద్ద, గొల్లపల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద మాట్లాడారు. ఆనాటి కాంగ్రెస్ పాలనలో నీళ్లు, కరంటు లేక ఉపాధి కరువై అనేక మంది బొంబై, దుబాయి వంటి ప్రాంతాలకు వలసలు పోయారని, అప్పుడు ఇంటి వద్ద ఉన్న మహిళలు జీవనోపాధి కోసం బీడీలు చుట్టడం మొదలు పెట్టారన్నారు. నాడు వాళ్లను ఎవరూ పట్టించుకోలేదని విమర్శించారు. కానీ, సీఎం కేసీఆర్ బీడీ పెన్షన్ అమలు చేశారని గుర్తు చేశారు. మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చాక బీడీ కార్మికులకు పీఎఫ్‌తో సంబంధం లేకుండా పింఛన్ అందజేస్తామని చెప్పారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం సిలిండర్‌తోపాటు ఉప్పు, పప్పు, నూనెలు తదితర నిత్యవసార వస్తువుల ధరలను విపరీతంగా పెంచేసిందని, సామాన్య జనాలు బతుకలేని పరిస్థితి నెలకొందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం గద్దెనెక్కిన వెంటనే సిలిండర్‌ను ₹400కే అందజేస్తామని, రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ చేస్తామన్నారు. పేద కుటుంబాలను ఆదుకునేందుకు రైతు బీమా తరహాలో కేసీఆర్ ఇంటింటికీ బీమా కింద ₹5లక్షల సాయం చేయనున్నట్లు చెప్పారు. పేదలకు కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందించేందుకు ఆరోగ్య పథకంలో బాగంగా ఎలాంటి వ్యాధులకైనా చికిత్స చేసుకునేందుకు ప్రవేట్ దవాఖానల్లో ₹15 లక్షల వరకు వైద్య సౌకర్యం కల్పించనున్నట్లు వివరించారు. నేనొక్కటే చెబుతున్నా.. మంచి చేసే వారెవరు..? ముంచే వారెవరు..? అని బాగా ఆలోచించి ఓటు వేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కాగా పెగడపల్లిలో మండలానికి చెందిన వివిధ పార్టీల నాయకులు కవిత సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆయా కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ రాష్ట్ర నేత రమణారావు, జడ్పీటీసీలు రాజేందర్‌రావు, జలంధర్, ఎంపీపీలు శోభా-సురేందర్‌రెడ్డి, శంకరయ్య, ఏఎంసీ చైర్ పర్సన్ లోక నిర్మల, స్థానిక సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ జమున-స్వామి, విండో చైర్మన్‌లు భాస్కర్‌రెడ్డి, వేణుగోపాల్, పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు మల్లారెడ్డి, వెంకన్న, పాక్స్ అధ్యక్షులు రాజసుమన్ రావు, మాధవ రావు, మార్కెట్ చైర్మన్ హన్మాండ్లు, వైస్ చైర్మన్ లింగా రెడ్డి, వైస్ ఎంపీపీ సత్తయ్య, గంగాధధర్, మండల అడ్‌హక్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఆనందం, కరుణాకర్‌రావు, యూత్ అధ్యక్షుడు సంతోష్, ఆర్బీఎస్ మండల అధ్యక్షుడు నరెందర్‌రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ ఆంజనేయులు, జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు గంగా రెడ్డి, మండల ఫోరం అధ్యక్షుడు రమేశ్, ఉప సర్పంచ్ రాజశేఖర్, నాయకులు లింగారెడ్డి, నారాయణ రెడ్డి, కొముర‌య్య, తిరుపతి ఉన్నారు.

### కడుపులో పెట్టుకుని చూసుకుంటా

తెలంగాణలో కేసీఆర్ సీఎం కాకుంటే మనకు ఈ సంక్షేమ ఫలాలు అందేవా..? సబ్బండవర్గాల సంక్షేమం సాధ్యపడేదా..? ఆలోచించాలి. దేశంలోనే వృద్ధులకు ₹2వేల పింఛన్ ఇస్తున్న రాష్ట్రం మనదే. ఒంటరి మహిళ, బీడీ కార్మికులకు పింఛన్, రైతులకు ఉచిత 24 గంటల విద్యుత్, రైతు బీమా, రైతు బంధు ఇస్తున్న ప్రభుత్వం కూడా మనదే. కాంగ్రెస్ వారెంటీ లేని గ్యారంటీలతో ప్రజలను మోసం చేయాలని చూస్తుంది. వారి మాటలు నమ్మి మోసపోతే మీ బతుకులు అంధకారమవుతయి. మీరు వేసే ఓటు మీ భవిష్యత్‌ను నిర్ణయిస్తుంది. జర ఆలోచించి అభివృద్ధి చేసే ప్రభుత్వానికి ఓటువేసి ఎన్నుకోవాలి. నన్ను ఆశీర్వదించి గెలిపిస్తే నియోజకవర్గ ప్రజలను కడుపులో పెట్టుకుని చూసుకుంట.

**- పెగడపల్లి, గొల్లపల్లి రోడ్‌షోల్లో ధర్మపురి అభ్యర్థి కొప్పుల ఈశ్వర్**

# ప్రజలతో మాది పేగుబంధం



ధర్మపురి : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత చిత్రంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, జగిత్యాల జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత

- కాంగ్రెస్‌ది అధికార కాంక్షే
- అధికారం శాశ్వతం కాదు.. అనుబంధం శాశ్వతం
- మేం ఎప్పుడూ ప్రజల వెంటే ఉన్నం
- బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టో అంటే భరోసా
- నాటి, నేటి పరిస్థితులు చూడండి
- కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించండి
- ధర్మపురిలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

ధర్మపురి/ధర్మపురి రూరల్, నవంబర్19: 'బీఆర్‌ఎస్‌కు తెలంగాణ ప్రజలతో ఉన్నది పేగు బంధం. కాంగ్రెస్‌ది అధికారం దక్కించుకుని తెలంగాణను అధోగతి పాలు చేసే అహంకారం. అధికారం శాశ్వతం కాదు. బంధమే శాశ్వతం. తెలంగాణ కోసం కొట్లాడిన నాడు, అధికారం లేని నాడు ప్రజల పక్షాన పోరాడినం. అధికారం ఉన్న నాడు ప్రజల కోసమే పని చేస్తున్నం' అని ఎమ్మెల్సీ కవిత స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ధర్మపురి క్షేత్రంలోని బ్రాహ్మణ సంఘ భవనంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి కొప్పుల ఈశ్వర్, పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్‌నేతకాని, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతతో కలిసి మహిళలతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్‌కు పెట్టే గుణం లేదని, అధికార కాంక్ష మాత్రమే ఉందని, ఎన్నికల సమయంలో మాత్రమే ఆ పార్టీకి ప్రజలు గుర్తుకు వస్తారని విమర్శించారు. 'అది చేస్తాం, ఇది ఇస్తాం.' అని ఝూటా మాటలు చెప్పి పోతారని, ప్రజలకు ఏమీ చేయరని మండిపడ్డారు. కాంగ్రెస్‌కు యాభై ఐదేండ్లు అవకాశం ఇస్తే ఏం చేశారని ప్రశ్నించారు. వారి హయాంలో పింఛన్ ₹200మాత్రమే ఇచ్చారన్నారు. కొత్త పింఛన్ కావాలంటే పాత పింఛన్‌దారుడు ఒకరు పోతే ఇచ్చేటువంటి దుస్థితి, దుఃఖం ఉండేదిదని గుర్తుచేశారు. కాంగ్రెస్ పాలనలో రైతులకు పైసా కూడా ఇవ్వలేదన్నారు. నేటి బీఆర్‌ఎస్ పాలనలో హనుమంతుని గుడి లేని ఊరు లేదని, సీఎం కేసీఆర్ సంక్షేమ పథకం అందని ఇల్లు లేదని చెప్పారు. రాష్ట్రంలో మరోసారి కేసీఆర్ ప్రభుత్వం ఏర్పడగానే పింఛన్‌ను ₹5వేలకు పెంచుకుంటాని, ఎన్నికల పూర్తయిన వెంటనే రూ.3వేలు అవుతుందని, తర్వాత ఏటేటా ₹500 పెంచుతూ ₹5వేలు చేస్తామన్నారు. కటాఫ్ డేట్‌తో సంబంధం లేకుండా, పీఎఫ్ కార్డు ఉన్నాలేకున్నా బీడీ కార్మికులందరికీ ₹5వేల పెన్షన్ ఇవ్వాలని సీఎం కేసీఆర్ సంకల్పించారన్నారు. సౌభాగ్య లక్ష్మి పథకం కింద పేద మహిళలకు ₹3వేల పింఛన్ ఇవ్వాలని నిర్ణయించామన్నారు. మూడోసారి అధికారంలోకి రాగానే కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తామని, దాంతో రాష్ట్రంలో రేషన్ కార్డులు కోటికి చేరుతాయన్నారు. కేసీఆర్ మ్యానిఫెస్టో అంటే అన్ని వర్గాలకు భరోసా అని, కేసీఆర్ బీమా కింద ప్రతి ఒక్కరికి ₹5లక్షల బీమా వర్తింపజేస్తామని చెప్పారు. రేషన్ కార్డు మీద సన్నబియ్యం సరాఫరా చేస్తామన్నారు. కేసీఆర్ ఆరోగ్య రక్ష పథకం కింద ₹15లక్షల ఆరోగ్య బీమా పరిమితిని పెంచుతామన్నారు. అలాగే అగ్రవర్ణ పేదల కోసం నియోజకవర్గానికి ఒక హాస్టల్ నిర్మిస్తామన్నారు. ఇంకా సొంత స్థలం ఉన్నపేదవారికి ఇండ్లు కట్టుకోవడానికి గృహలక్ష్మి పథకం ₹3లక్షల అందజేస్తున్నామని, ధర్మపురి నియోజకవర్గంలో ఇప్పటికే 4వేల మందికి ఇచ్చినట్లు చెప్పారు. రానున్న రోజుల్లో ఇళ్లు లేని ప్రతి కుటుంబానికి ఇండ్లు కట్టడమో..? డబ్బులు ఇవ్వడమో చేస్తామన్నారు. వచ్చే రానున్న ఎన్నికల్లో యువత ఎక్కువ సంఖ్యలో ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ డా శ్రీకాంత్‌రెడ్డి, జడ్పీటీసీలు బాధినేని రాజేందర్, బత్తిని అరుణ, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తెమ్మ, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఇందారపు రామన్న, ఏఎంసీ వైస్ చైర్మన్ సునీల్ కుమార్, కౌన్సిలర్లు ఉన్నారు.

### మోడీ అంకుల్ సిలిండర్ కోసం ₹1200 ఇగ్గుకున్నడు

ప్రధానిగా మోడీ అంకుల్ వచ్చినకాన్నుంచి ధరలు భయంకరంగా పెరిగినయి. పదేండ్ల కింద సిలిండర్ ధర ₹400 ఉండె. ఇప్పుడు ₹1200కు చేరింది. సిలిండర్ ధర తగ్గించడయ్యా అంటూ కేసీఆర్ సార్ మోడీ అంకుల్‌ను అడిగి అడిగీ విసుగు చెందిండు. ఇక లాభం లేదనుకున్నడు. మళ్లీ అధికారంలో రాగానే గ్యాస్ సిలిండర్ ₹400లకే ఇస్తానన్నడు. మొన్నటి దాకా తెలంగాణ ప్రభుత్వం ₹2వేలు పింఛన్ ఇస్తే అందులో సిలిండర్ కోసం మోడీ అంకుల్ ₹1200 ఇగ్గుకున్నడు. ఇగ మిగిలింది ₹800లే. అందుకే కేసీఆర్ సారు బాగా ఆలోచించి సిలిండర్ ధర మూడొంతులు తగ్గిస్తనన్నడు. పెన్షన్ డబుల్ కన్నా ఎక్కువ ఇస్తనన్నడు. అందరూ ఆలోచించాలి. కారుగుర్తుకు ఓటేసి ధర్మపురి ఎమ్మెల్యేగా కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి.

**- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**

### కరెంట్ బుగ్గ వెలిగితేనే కారు గుర్తుకు ఓటేయండి

పదేండ్ల కిందటి వరకు కరెంటు ఉంటే వార్త. కానీ ఇప్పుడు కరెంటు పోతే వార్త. నాడు రాత్రి పూట కరెంటుతో రైతులు అరిగోస పడ్డరు. పాముకాటుకు, తేలుకాటుకు గురై ఎందరో రైతులు ప్రాణాలు చనిపోయిన్రు. రాత్రిపూట చేనుకాడికి పోయేందుకు రైతులు దుబాయ్ నుంచి టార్చ్‌లైట్లు తెప్పించుకునేటోళ్లు. కానీ, తెలంగాణ వచ్చిన తర్వాత రైతులకు మంచిరోజులచ్చినయి. ఇప్పుడు తెలంగాణలో వ్యవసాయం ఒక పండుగ అయింది. రైతు బంధు, రైతుబీమా పథకాలు దేశానికే ఆదర్శగా నిలిచిన సంగతి అందరికీ తెలుసు. గత పాలకుల పరిస్థితులు, ఇప్పటి పరిస్థితులు గుర్తు చేసుకోవాలి. ఈ నెల 30న పొద్దన్నే నిద్రలేచి మొదట దేవుడికి దండం పెట్టి ఇంట్లో ఉన్న స్విచ్ ఆన్ చేయాలి. కరెంటు బుగ్గ వెలిగితేనే బీఆర్‌ఎస్ కారు గుర్తుకు ఓటు వేయాలి. లేకుంటే లేదు.

**- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**

### ఆలోచించకుంటే ఆగమైతం



పద్నాలుగేండ్లుగా ధర్మపురి నియోజకవర్గాన్ని ఒక పంట పొలంలా కాపాడుకుంటూ వచ్చిన. ప్రజలను కంటికి రెప్పలా చూసుకున్న. కాంగ్రెస్, బీజేపీ అబద్ధాలతో వస్తున్నయి. ఇప్పుడు తప్పుడు నిర్ణయం తీసుకుంటే ఆగమైతం. ప్రజలు బాగా ఆలోచించి కారు గుర్తుకు ఓటేసి నన్ను గెలిపించాలి. పేదల సంక్షేమం కోసం పనిచేసే బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే మళ్లీ పట్టం కట్టాలి. మహిళల సంక్షేమం కోసం అనేక పథకాలు రూపొందించి అమలు చేస్తున్నం. మూడోసారి అధికారంలోకి వస్తే ప్రజలకు మేలు చేసే స్కీంలతో మ్యానిఫెస్టో తయారు చేసినం. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మళ్లీ పాత కథే అయితది. వారి పాలనలో పడ్డ కరెంటు కష్టాలను ఒక్కసారి గుర్తు చేసుకోవాలి. ముక్కిపోయిన మూడు గంటల కరెంటిచ్చే కాంగ్రెస్ కావాలా..? 24గంటల నాణ్యమైన కరెంటు ఇచ్చే బీఆర్‌ఎస్ కావాలా..? ఆలోచించుకోండి. గతంలో రైతుల దగ్గర పన్నులు వసూలు చేసిన చరిత్ర కాంగ్రెస్‌దైతే, ఇప్పుడు రైతులకే రైతు బంధు, రైతుబీమా, రుణమాఫీ ఇస్తున్న ఘనత బీఆర్‌ఎస్‌ది.

**- ధర్మపురి అభ్యర్థి కొప్పుల ఈశ్వర్**